క్లుప్తంగా

మహనీయుల విగ్రహాలకు జలాభిషేకం

ఒంగోలు సబర్బన్: నగరంలోని మహనీయుల విగ్రహాలకు ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జలాభిషేకం నిర్వహించారు. ప్రతి నెలా ఒకటో తేదీ నగరంలోని మహనీయుల విగ్రహాలను నీటితో శుద్ధిచేయాలని ఒంగోలు నగరపాలక సంస్థ అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న మహనీయుల విగ్రహాలకు జలాభిషేకం చేసి నివాళులర్పించారు.

8న లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభం

ఒంగోలు సిటీ: లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, రిటైర్డు ఐఏఎస్ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు ఈ నెల 8వ తేదీ రాష్ట్ర కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు జిల్లా కన్వీనర్ ఇస్తర్ల శంకర్ తెలిపారు. ఒంగోలులోని జిల్లా కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించి శంకర్ మాట్లాడారు. పార్టీ బాధ్యులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర కార్యాలయ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

డివైడర్ల పనుల పరిశీలన

ఒంగోలు సబర్బన్: నగరంలో జరుగుతున్న డివైడర్ పనులను నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. డివైడర్ల మధ్యలో మొక్కలు నాటడం, డివైడర్లకు రంగులు వేసే పనులను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. స్థానిక సంఘమిత్ర హాస్పిటల్ జంక్షన్ వద్ద గల కాసు బ్రహ్మానందరెడ్డి విగ్రహం నుంచి ప్రకాశం భవన్ వరకు జరుగుతున్న పనులను పరిశీలించారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

ఒంగోలు సిటీ: ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని సూరారెడ్డిపాలెం ఐటీసీ వాహన డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ సీనియర్ నాయకుడు సయ్యద్ సర్దార్ జెండా ఆవిష్కరించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు, ట్యాంకర్స్ డ్రైవర్స్ యూనియన్ నాయకుడు శ్రీనివాసులు, కార్మికులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై తనిఖీలు

ఒంగోలు సిటీ: గతంలో బెల్ట్ షాపులు నిర్వహించిన వారి షాపులను ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ సీఐ అజయ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. ఒంగోలు మండలంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో గల త్రోవగుంట, కరవది, దేవరంపాడు, ఉలిచి, గుండాయపాలెం గ్రామాల్లో సీఐ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఒంగోలు మండలంలో ఎక్కడా బెల్ట్ షాపులు నిర్వహించకూడదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకూడదని తెలిపారు. తనిఖీల్లో ఎస్సై అనీత, సిబ్బంది పాల్గొన్నారు.

9న దళిత సంఘాల ప్రతినిధుల సమావేశం

ఒంగోలు వన్‌టౌన్: ఈ నెల 9వ తేదీ చీరాలలోని అంబేడ్కర్ భవన్‌లో రాష్ట్ర మాల, దళిత సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహించనున్నట్లు దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దళిత మహాసభ అధ్యక్షుడు అధ్యక్షత వహించే ఈ కార్యక్రమంలో నాయకులంతా పాల్గొనాలని కోరారు.

మీటర్ రీడర్ల పాత్ర కీలకం

ఒంగోలు సిటీ: విద్యుత్ సంస్థలో ఔట్ సోర్సింగ్ థర్డ్ పార్టీ ఉద్యోగులైన మీటర్ రీడర్ల పాత్ర ఎంతో కీలకమని ఏఐటీఎస్ నాయకుడు కొత్తకోట వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మీటర్ రీడర్లతో నిర్వహించిన సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు కావొచ్చినా కొత్త టెండర్లు పిలవకపోవడం పాత కాంట్రాక్టర్లను కొనసాగించడం, స్మార్ట్ మీటర్లు త్వరగా అన్ని సర్వీస్‌లకు బిగించడం చూస్తుంటే పొమ్మనకుండా పొగ పెడుతున్న చందంగా మారిందని విమర్శించారు. నేడు స్మార్ట్ మీటర్ల రూపంలో మీటర్ రీడర్ల ఉపాధికి ముప్పు వచ్చిన తరుణంలో విద్యుత్ ఉన్నతాధికారులు మీటర్ రీడర్లకి మినిట్స్ రూపంలో ఇచ్చిన హామీని అమలు చేసి వారి కుటుంబాలను రోడ్డున పడకుండా ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు, కె.అంజయ్య, కె.సిద్దయ్య, సాజిద్, సతీష్‌కుమార్, సయ్యద్ హుస్సేన్, మాల్యాద్రి, గొప్పరాజు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి నివాళులు

ఒంగోలు సిటీ: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నాగాంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం అమరజీవికి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు దామరాజు క్రాంతికుమార్ పాల్గొని ఒంగోలులోని ముంగమూరు రోడ్డు జంక్షన్ వద్ద గల అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు కె.రవికుమార్, టి.రవికుమార్, నరసయ్య, ఎం.అంకబాబు, ఎస్.రాజశేఖర్, వర్ధి శ్రీనివాస్, బసివిరెడ్డి, కసిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నరకాసురవధ కార్యక్రమంలో శాస్త్రీయ నృత్యం...



గాంధీరోడ్డు కూడలిలో నరకాసురవధ ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు

దివ్యకాంతుల రవళి..
ఆనంద దీపావళి

దీపావళి పండుగను ఒంగోలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నా..పెద్దా తేడా లేకుండా కుటుంబ సభ్యులంతా కలిసి బాణసంచా కాల్చి ఆనందంగా గడిపారు. వెలుగులు విరజిమ్మే చిచ్చుబుడ్లు, దూసుక్వెళ్లే తారాజువ్వలు, 1000 వాలా, 5000 వాలా, హైడ్రోజన్ బాంబుల మోతలతో నగరం దద్దరిల్లింది. ఒంగోలులో నిర్వహించిన నరకాసురవధ కార్యక్రమం ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. – ఒంగోలు మెట్రో



బాణం ఎక్కుపెట్టి నరకాసురుడిని వధిస్తున్న సత్యభామ వేషధారణలో చిన్నారి



గాంధీరోడ్డు కూడలిలో నరకాసురవధ ప్రదర్శనలో పౌరాణిక పద్యాలు ఆలపిస్తున్న నరకాసుర వేషధారుడు



దీపావళి వేడుకలు జరుపుకుంటున్న కుటుంబం





చీమకుర్తిలో బాణసంచా కాలుస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వెంకాయమ్మ, కుటుంబ సభ్యులు





బాణసంచా కాలుస్తున్న ప్రజలు

నిబంధనలు ఉల్లంఘించి బాణసంచా విక్రయాలు



గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తున్న దృశ్యం



వెల్లంపల్లిలో...

- మద్దిపాడు మండలంలో 3 షాపులకే అనుమతి.. 30 షాపుల్లో విక్రయాలు
- పట్టించుకోని స్థానిక పోలీసులు

మద్దిపాడు: మండలంలో బాణసంచా విక్రయాలకు అనుమతులిచ్చింది ముగ్గురికైతే.. 30 షాపులకు పైగా ఏర్పాటు చేశారు. నిబంధనలు ఉల్లంఘించి విచ్చలవిడిగా బాణసంచా విక్రయించినప్పటికీ.. స్థానిక పోలీసులు నిర్లక్ష్యంగా వదిలేశారు. సాధారణంగా పర్మిషన్లు ఇచ్చే సమయంలో షాపులు ఏర్పాటు చేసుకోవడానికి విశాలమైన స్థలంలో మాత్రమే అనుమతులిస్తారు. అంతేగాకుండా షాపుల వారు అగ్నిమాపక వ్యవస్థను కూడా అందుబాటులో ఉంచుకోవాలి. కానీ, ఇలాంటి నిబంధనలేమీ లేకుండానే మండలంలో బాణసంచా విక్రయాలు యథేచ్ఛగా సాగాయి. మద్దిపాడులో మూడు షాపులకు మాత్రమే అనుమతులు ఉండగా, మండలంలోని అన్ని గ్రామాల్లో మూడు నుంచి నాలుగు షాపుల వరకూ ఏర్పాటు చేసి బాణసంచా విక్రయించారు. వారంతా అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తున్నారని తెలిసినా మద్దిపాడు పోలీసులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారు. అనధికారికంగా బాణసంచా ఏర్పాటు చేసిన ప్రాంతాలేమైనా జనావాసాలకు దూరంగా ఉన్నాయా అంటే అదీ లేదు. జనావాసాల మధ్యే సెంటర్లలో దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత అనే విషయం పెద్ద ప్రశ్నగా మిగిలిపోయిందంటూ పలువురు విమర్శించారు. అమలు చేయనప్పుడు అసలు నిబంధనలు విధించడం ఎందుకనే ప్రశ్నలు తలెత్తాయి. మండలంలో నిబంధనలు అమలుచేయడంలో స్థానిక పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు విమర్శించారు.

విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించండి



ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ సుబ్బారావు

చీమకుర్తి: ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని డిప్యూటీ డీఈఓ సామా సుబ్బారావు ఆదేశించారు. శుక్రవారం చీమకుర్తి ఎంఆర్సీ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. విద్యార్థుల సంఖ్యకు తగిన విధంగా వాష్‌రూములు, తాగునీటి సదుపాయాలను అందుబాటులో ఉంచాలన్నారు. అపార్ జనరేట్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. విద్యార్థుల భద్రత, విద్యాప్రమాణాల నాణ్యతను పాటించాలన్నారు. తొలుత చీమకుర్తిలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ హైస్కూలుతో పాటు నారాయణ ప్రైవేటు పాఠశాలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరును స్వయంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత గురించి అడిగి తెలుసుకోవడంతో పాటు భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ఎస్ఏ–1 మార్కుల ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కే శివాజీ పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు

ఒంగోలు వన్‌టౌన్: స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో బీసీ సంక్షేమ సాధన సమితి ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు నిర్వహించారు. సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దులూరి శ్రీనివాసులు, కానుగుల నాగేశ్వరరావు, దన్నారపు మస్తాన్‌రావు, వల్లభను రంగారావు పాల్గొన్నారు.

కొత్తపట్నం మండలంలో...

కొత్తపట్నం: దీపావళి పర్వదినాన్ని మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన అనంతరం బాణసంచా కాల్చి సందడి చేశారు. గురువారంతో పాటు శుక్రవారం రెండోరోజు కూడా దీపావళి వేడుకలు జరుపుకున్నారు. ఈ ఏడాది మందుల ధరలు ఎక్కువగా పెరగడంతో చాలా తక్కువగా మందులు కొనుగోలు చేశారు. కొత్తపట్నం, ఈతముక్కల, మడనూరులో బాణసంచా విక్రయ షాపులు ఏర్పాటు చేశారు.

బెల్టు షాపులో 10 మద్యం బాటిళ్లు పట్టివేత



పట్టుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై

సంతనూతలపాడు: మండలంలోని గుడిపాడులో గురువారం అనధికారికంగా ఒక మహిళ తన దుకాణంలో మద్యం విక్రయిస్తుండగా, ఎస్సై అజయ్‌బాబు ఆదేశాల మేరకు ఏఎస్సై జి.వెంకట్రావు, పోలీస్ సిబ్బంది దాడి చేశారు. 10 మద్యం బాటిళ్లను పట్టుకుని ఆ మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

మాతాశిశు వైద్యశాలలో పండ్లు పంపిణీ



పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

ఒంగోలు మెట్రో: ఆలిండియా మహాత్మా సోషల్ క్లబ్స్ ఒంగోలు శాఖలు ఎయిమ్స్ క్లబ్ ఒంగోలు, ఎయిమ్స్ క్లబ్ వనిత ఒంగోలు, ఎయిమ్స్ క్లబ్ ఒంగోలు జూనియర్స్, వాసవీ క్లబ్ ఒంగోలు సంయుక్త ఆధ్వర్యంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక మాతాశు వైద్యశాలలోని గర్భిణులు, బాలింతలకు గురువారం పండ్లు, రొట్టెలు, శిశువులకు జుబ్బాలు పంపిణీ చేశారు. ఆలిండియా మహాత్మా సోషల్ క్లబ్స్ పూర్వ జాతీయ అధ్యక్షుడు రాధా రమణగుప్తా జంధ్యం, సభ్యులు నేరెళ్ల శ్రీనివాసరావు, తుమ్మపూడి ఏడుకొండలు, ధనిశెట్టి రామునాయుడు, చీదెళ్ల వేంకట ప్రసాద్, భూమా శ్రీనివాసులు, వాసవీ క్లబ్ ఒంగోలు అధ్యక్షుడు నల్లమల్లి బదరి నారాయణ, సుధీర్ కుమార్, కే జగన్నాథం, గుడివాడ పార్థసారధి, బి.విజయరావు, టి.సత్యవతి, గుర్రం కృష్ణ, సుబ్బయ్య, ప్రసూతి వైద్యనిపుణులు డాక్టర్ చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జంగం సంఘ కార్తీక వనభోజన సమారాధన

ఒంగోలు వన్‌టౌన్: ఒంగోలు ప్రాంతీయ జంగం సంఘ కార్తీక వనభోజన సమారాధన కార్యక్రమాన్ని ఈ నెల 3వ తేదీ స్థానిక ఫ్యాన్సీ గూడ్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించనున్నట్లు సంఘ కార్యదర్శి సీహెచ్ శివప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉచిత డీఎస్సీ శిక్షణకు 10న ఎంపిక పరీక్ష

ఒంగోలు వన్‌టౌన్: సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అందిస్తున్న డీఎస్సీ ఉచిత శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఈ నెల 10వ తేదీ ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు ఎన్.లక్ష్మానాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పరీక్ష సమాచారాన్ని అభ్యర్థులకు దరఖాస్తు సమయంలో అందించిన మొబైల్ నంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ఎంపిక చేసిన స్టడీ సర్కిల్స్ నుంచి మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు చెప్పారు.

3లోపు అభ్యంతరాలు సమర్పించాలి

ఒంగోలు సిటీ: సమగ్రశిక్ష కార్యాలయంలో ఖాళీగా ఉన్న సెక్టోరియల్ ఆఫీసర్స్–5, ఏఎస్ఓ–1 పోస్టుకు దరఖాస్తు చేసిన వారి సర్టిఫికెట్ల వెరిఫై వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచారని డీఈఓ కిరణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటిపై అభ్యంతరాలుంటే ఈ నెల 3వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత ఆధారాలతో సమగ్రశిక్ష కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

కబడ్డీ అసోసియేషన్ కార్యవర్గ ఎంపిక రేపు

ఒంగోలు: ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎంపిక ఈనెల 3న స్థానిక సమ్మర్ స్టోరేజీ ట్యాంకు –1 సమీపంలోని ఆస్తోనా ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశానికి ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.వెంకటరెడ్డి, కార్యదర్శి వై.శ్రీకాంత్ పరిశీలకులుగా హాజరవుతున్నారని, జాతీయ, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు తప్పక హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

సీపీఎం మండల కార్యదర్శిగా పల్లాపల్లి

చీమకుర్తి: సీపీఎం మండల కార్యదర్శిగా పల్లాపల్లి ఆంజనేయులును ఆ పార్టీ నాయకత్వం నియమించింది. శుక్రవారం చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి మహాసభలో మండల నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్యదర్శివర్గ సభ్యులుగా పూసపాటి వెంకట్రావు, క్రిష్టిపాటి చిన్నపురెడ్డి, బెజవాడ శ్రీనివాసరావు, తొట్టెంపూడి రామారావు, కమిటీ సభ్యులుగా పొత్తూరి సురేష్, శీలం ఆదినారాయణ, బొద్దు ఓబులేసు, కుమ్మిత శ్రీనివాసరెడ్డి, చిట్యాల కొండయ్య, పీ పద్మ, నుగ్గు శ్రీనును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, తెగిన కారుమంచి కాలువకు మరమ్మతులు చేయించాలని, కేవీ పాలెం రోడ్డులో సాగర్ కాలువపై శిథిలావస్థకు చేరుకున్న వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మించాలనే తీర్మానాలను ఆమోదించారు.

ఆండ్రాయిడ్ మొబైల్ టెక్నాలజీపై
అవగాహన కార్యక్రమం



రిసోర్సుపర్సన్ ప్రభుదాసుకు అభినందనలు తెలుపుతున్న కళాశాల మేనేజ్‌మెంట్

ఒంగోలు సిటీ: ఆండ్రాయిడ్ మొబైల్ టెక్నాలజీపై ఇంజినీరింగ్ విద్యార్థులకు గెస్ట్ లెక్చర్, యాకోలో యాప్‌లీడ్‌లో విధులు నిర్వహిస్తున్న కె.ప్రభుదాస్ శుక్రవారం అవగాహన కల్పించారు. స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ×ది వరల్డ్ ఆఫ్ మొబైల్ టెక్నాలజీ, ట్రెండ్స్, టిప్స్ అండ్ ట్రాన్స్‌ఫర్మేషన్స్₹ అనే అంశంపై గెస్ట్ లెక్చర్ కార్యక్రమాన్ని కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రస్తుత సాఫ్ట్‌వేర్ రంగంలో మొబైల్ టెక్నాలజీలో గల అవకాశాలు, ప్రస్తుతం మనం ఉపయోగిస్తున్న పలు ఆండ్రాయిడ్ అప్లికేషన్ల గురించి వివరించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టరు మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టరు జి.వి.కె. మూర్తి, డీన్ అకడమిక్స్ డాక్టరు సీవీ సుబ్బారావు, డీన్ ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ రూప అక్కేష్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టరు ఎస్.గిరిబాబు, కోఆర్డినేటర్లు విశ్వేశ్వరరావు, నవీన, సురేష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు మైనంపాడు విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు డీవీఎల్ నరసింహారావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన పోటీల్లో ప్రతిభ చూపి అండర్–17 బాలికల విభాగంలో సాయి శ్రీవాణి, సుహర్షిత, శృతి, కావ్య, అనిత, బాలుర విభాగంలో కై లాష్ కుమార్, చరణ్ కుమార్, యశ్వంత్ కుమార్, కార్తీక్, అఖిల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు వివరించారు. ఈ నెల 3, 4, 5 తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, టీచర్ ఓబుల్ పాల్గొన్నారు.

అపెక్స్ విద్యార్థులను అభినందించిన మంత్రి



అపెక్స్ విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి

ఒంగోలు సిటీ: 3వ జాతీయ ఫ్లోర్ కర్లింగ్ ఆటల పోటీల్లో ప్రకాశం జిల్లా ఖ్యాతిని జాతీయస్థాయిలో నిలిపిన అపెక్స్ స్కూల్ విద్యార్థులను మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శుక్రవారం అభినందించారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న స్కూలు యాజమాన్యం శివకోటిరెడ్డిని ప్రశంసించారు. ఈ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన మృదుల, ఆదిత్య, రేణుకా, సిల్వర్ మెడల్ సాధించిన ఈశ్వర్‌రెడ్డి, యోజిత్, సాయి, కాంస్య పతకాలు సాధించిన ప్రేమ్‌శ్రీచంద్, విష్ణు, జి.విష్ణు విద్యార్థులను కరస్పాండెంట్ కె.శివకోటిరెడి ప్రత్యేకంగా అభినందించారు. వీరితో పాటు ఏపీ సమాచారహక్కు సంఘ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంధవళ్ల బాలకృష్ణ, పాఠశాల ఏఓ ఎస్కే భాషా, పీఈటీ ఆనంద్, వార్డెన్ మణికంఠ, తదితరులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఘనంగా భక్తభజన సమాజం వార్షికోత్సవం



హరే రామ సంకీర్తనలో పాల్గొన్న గాయత్రి భక్తభజన సమాజం ప్రతినిధులు

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డు గాయత్రి మందిరంలో గాయత్రి మందిర భక్తభజన సమాజం 23వ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హరే రామ నామ సంకీర్తన, అర్ధ ఏకాహం నిర్వహించారు. మందిరంలో వేదికను అలంకరించి అభిషేకాలు, పూజ క్రతువులు నిర్వహించారు. గణపతి, ఆంజనేయస్వామి, శివపార్వతులు, సుబ్రహ్మణ్యస్వామి, వారాహి అమ్మవారు, కన్యకాపరమేశ్వరి, మహాలక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. గాయత్రి మందిర కమిటీ నిర్వాహకులు పర్యవేక్షించగా, భక్తులు పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు పేర్నమిట్ట విద్యార్థిని



విద్యార్థిని సాయికుమారితో ఉపాధ్యాయులు

సంతనూతలపాడు: పేర్నమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న టి.సాయికుమారి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ జావలిన్ త్రో విభాగంలో జిల్లా తరఫున పాల్గొంటున్నట్లు హెచ్ఎం పార్వతీ శాంతి తెలిపారు. ఈ నెల 2వ తేదీ నుంచి శ్రీకాకుళంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్న సాయికుమారిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు కె.నారాయణరావు, మూర్తి, ఫణీంద్ర, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.రత్నకుమార్ తదితరులు అభినందించారు.